
ప్రభాత తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
23-12-2024
సోమవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 104 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

# భారత్‌తో బలపడుతున్న గల్ఫ్ దేశాల బంధం

## మోదీ హయాంలో 8 రెట్లు పెరిగిన విదేశీ పెట్టుబడులు



నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ప్రస్తుతం, వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగాలు మినహా, చాలా రంగాలు ఎఫ్‌డీఐ అనుమతినిచ్చింది మోదీ ప్రభుత్వం. ఈ నేపథ్యంలోనే గల్ఫ్ కోఆపరేటివ్ కౌన్సిల్ దేశాల నుండి భారతదేశానికి వస్తున్న FDIలు గత 10 సంవత్సరాలలో 8శాతం పెరిగాయి.

2 లో



# రాహుల్ గాంధీకి మరోసారి కేసుల కష్టాలు

## నోటీసులు జారీ చేసిన బరేలి కోర్టు..

జయభేరి, హైదరాబాద్ :

కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి మళ్లీ కోర్టు కష్టాలు వచ్చాయి. కులగణనపై లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఉత్తర ప్రదేశ్‌లోని బరేలీ కోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు రాహుల్ గాంధీ జనవరి 7వ తేదీన హాజరు కావాలంటూ ఆదేశాలు జారీ చేసింది. రాహుల్ వ్యాఖ్యలు దేశాన్ని విడదీసేలా ఉన్నాయంటూ.. పంకజ్ పాఠక్ అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఎన్నికల ప్రచారంలో రాహుల్ వ్యాఖ్యలను ప్రస్తావించారు పిటిషనర్. దీంతో విచారణ జరిపిన కోర్టు ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభలో తాము అధికారంలోకి వస్తే జనాభా ప్రాతిపదికన.. దేశ సంపదను పంచుతామని రాహుల్‌గాంధీ అన్నారు. ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు జనాభా ప్రాతిపదికన ఇస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. తొలుత ప్రజా ప్రతినిధుల కోర్టులో పంకజ్ పాఠక్ పిటిషన్ దాఖలు చేయగా, విచారణకు తోసిపుచ్చింది. తాజాగా జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. దీంతో అతడి పిటిషన్ ను విచారణకు కోర్టు స్వీకరించింది. ఈ క్రమంలో జనవరి 7న కేసు విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ రాహుల్ కు నోటీసులు జారీ చేసింది. రాహుల్ వ్యాఖ్యలు

...మిగతాది 2 లో

# ఆంధ్రాలో కన్సల్టెన్సీ రాజ్

## కన్సల్టెంట్ల మోజులో ఏపీ బ్యూరోక్రసీ, అంతుచిక్కని కారణాలు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగం కన్సల్టెంట్ల గుప్పెట్లో చిక్కుకుందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నా, నైపుణ్యం పేరుతో లక్షలకు లక్షలు జీతాలు చెల్లించి స్టేట్ సర్వీస్ అధికారులపై పెత్తనం చేయడానికి కన్సల్టెంట్లను పాలనా వ్యవస్థలో చొప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కొన్నేళ్లుగా ఈ తంతు యథేచ్ఛగా సాగుతోంది. పార్టీలు, ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ వ్యవస్థల్లో మధ్యవర్తుల చొరబాటు అంతకంతకు ఎక్కువైపోతోంది. ప్రభుత్వ విభాగాల్లో రకరకాల కారణాలతో కన్సల్టెంట్ల నియామకం కొన్నేళ్లుగా సాగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత ఆలిండియా సర్వీస్ అధికారుల కంటే ఎక్కువ జీతాలు చెల్లించి మరీ కన్సల్టెంట్లను నియమించుకునే సాంప్రదాయం మొదలైంది. ప్రభుత్వ ఉద్యోగులపై పాలకులకు నమ్మకం లేకపోవడం, తాము చెప్పినట్టు చేయడం వంటి కారణాలతో కన్సల్టెంట్లకు పాలకులు మొగ్గు చూపుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, బ్యూరోక్రసీలో కన్సల్టెంట్ల హవా మాత్రం తగ్గడం లేదు. ముఖ్యమంత్రి ని ప్రసన్నం చేసుకునేందుకు అఖిల భారత స్థాయి అధికారులు అంతర్జాతీయ కన్సల్టెంట్లపై ఆధారపడటంతో ప్రభుత్వ డేటాను అందమైన ప్రెజెంటేషన్లుగా మార్చేసి అంకెల

...మిగతాది 2 లో



# ఏపీ, తెలంగాణలో క్రిస్మస్ హాలీడేస్

జయభేరి, హైదరాబాద్ :

తెలుగు రాష్ట్రాల్లో క్రిస్మస్ సంబరాలు మొదలయ్యాయి. క్రిస్మస్ సెలవుల కోసం విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. క్రిస్మస్ కు ఎన్నిరోజుల సెలవులో ఇప్పటికే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు క్లారిటీ ఇచ్చాయి. తెలంగాణ ప్రభుత్వం క్యాలెండర్ ప్రకారం ఈ నెల 25, 26 తేదీల్లో పబ్లిక్ హాలీడేస్ గా ప్రకటించారు. ఈ రెండు రోజులు స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ ఆఫీసులకు సెలవులు ఉంటాయి. డిసెంబర్ 24న ఆప్షనల్ హాలీడే ఉండడంతో కొన్ని స్కూళ్లు ఆ రోజూ సెలవు ప్రకటించే అవకాశం ఉంది. ముఖ్యంగా క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలలు ఈ నెల 24న సెలవు ఇచ్చే అవకాశం ఉంది. ఈ రోజు సెలవు ఇస్తే మరో రోజు ఎప్పుడైనా స్కూల్ నిర్వహించే అవకాశం ఉంది. 2025 ఏడాదికి సంబంధించి సాధారణ , ఆప్షనల్ సెలవుల జాబితాను ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం 27 సాధారణ సెలవులు, 23 ఆప్షనల్ సెలవులను జాబితాలో చేర్చింది. జనవరి 1న నూతన సంవత్సరం సందర్భంగా సెలవు ఇస్తారు. దీనికి ప్రతిగా ఫిబ్రవరి 10న రెండో శనివారాన్ని పనిదినంగా నిర్ణయించారు. ఇక ఏపీలో ఈ నెల 25న మాత్రమే పబ్లిక్ హాలీడే గా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 24, 26 తేదీల్లో ఆప్షనల్ హాలీడేస్ గా వెల్లడించింది.



# మోహన్ బాబుది కుటుంబ సమస్య

## రోడ్డెక్కి న్యూసెన్స్ సృష్టిస్తే చర్యలు తప్పవ్- డీజీపీ జితేందర్

జయభేరి, హైదరాబాద్ :

సినీ హీరోలు అత్యుత్సాహం ప్రదర్శిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోక తప్పదని స్పష్టం చేశారు తెలంగాణ డీజీపీ జితేందర్. ఇప్పటికే అల్లు అర్జున్ పై కేసు నమోదు చేశామని చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మోహన్ బాబు ది కుటుంబ సమస్య ఇంటి లోపల సమస్య పరిష్కరించుకుంటే ఎవరికీ అభ్యంతరం లేదని రోడ్డెక్కి న్యూసెన్స్ సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. తెలంగాణ డీజీపీ జితేందర్, ఐజీ రమారాజేశ్వరి, కరీంనగర్ సీపీ అభిషేక్ మోహంతితో కలిసి కరీంనగర్ లో పర్యటించారు. కొత్తపల్లిలో మహిళా సేఫ్టీ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. మహిళలకు, పిల్లలకు సమస్యలు ఉంటే భరోసా కేంద్రానికి రావొచ్చని తెలిపారు. అన్ని జిల్లాలో భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ప్లాన్ ఉందన్నారు. మహిళల పిల్లల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇతర రాష్ట్రాల పోలీసులు భరోసా కేంద్రాలను సందర్శిస్తున్నారని తెలిపారు.

...మిగతాది 2 లో

# మానవాళికి మరో పెనుముప్పు!

## ఆ ల్యాబ్ నుంచి ఏకంగా 100 ప్రాణాంతక వైరస్‌లు మిస్సింగ్..



కరోనా వైరస్ ప్రళయతాండవం ఇంకా కళ్లముందే మెదులుతుంది. చైనాలోని ఓ ల్యాబ్ నుంచి ఈ వైరస్ బయటకు రావడం వల్లనే ప్రపంచ వ్యాప్తగా కోట్లాది ప్రాణాలు గాల్లోకలిసి పోయినట్లు ఇప్పటికే పలు అధ్యయాలు వెల్లడించాయి కూడా. ఇలాంటి మరో ప్రాణాంతక వ్యాధి మళ్లీ మళ్లీ రాకూడదని యావత్ ప్రపంచం ఎన్నో దేవుళ్లకు మొక్కింది. ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న జనాలకు మరో షాకింగ్ న్యూస్ వెలుగులోకి వచ్చింది. అదేంటంటే తాజాగా మరో ల్యాబ్ నుంచి ఏకంగా వంద ప్రాణాంతక వైరస్‌లను గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారు. ఈ మేరకు ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్‌లోని అధికారులు వెల్లడించారు. అక్కడి ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ల్యాబ్ నుంచి హెంద్రా వైరస్‌తో సహా దాదాపు 100 ప్రాణాంతకమైన వైరస్ నమూనాలు చోరీకి గురైనట్లు తెలిపారు. ఈ బయోసెక్యూరిటీ ఉల్లంఘనపై అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. 2021లో వైరాలజీ లేబొరేటరీలో జరిగిన ఈ సంఘటన సేఫ్టీ ప్రోటోకాల్స్‌లో అతిపెద్ద లోపంగా అభివర్ణించింది. క్వీన్స్‌ల్యాండ్ హెల్త్ ని వేదికల ప్రకారం.. హెంద్రా వైరస్, లైసావైరస్, హాంటావైరస్ కలిగిన నమూనాలను నిల్వ చేసే ఫ్రీజర్ విచ్ఛిన్నం అయినట్లు గుర్తించారు. అందులో ఉన్న దాదాపు 100 శాంపిల్స్

...మిగతాది 2 లో



# టాలీవుడ్ వర్సెస్ స్టేట్ గవర్నమెంట్

## అప్పుడు ఏపీలో, ఇప్పుడు తెలంగాణలో!

జయభేరి, హైదరాబాద్ :

దక్షిణ భారతదేశంలో సినీ పరిశ్రమకు రాజకీయాలకు చాలా దగ్గర సంబంధం ఉంటుంది. సినీ పరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి వచ్చి చక్రం తిప్పిన వారు ఎందరో ఉన్నారు. ఎంజీఆర్, ఎన్టీఆర్, జయ లలిత సీఎంలు అయితే... చిరంజీవి, బాలకృష్ణ, పవన్ కల్యాణ్, రోజా, ఉదయనిధి స్టాలిన్.. ఇలా ఎంతో మంది

...మిగతాది 2 లో

# ప్రభుత్వాలు ఎన్ని మారిన వివక్ష ధోరణి మారదా...!?

2 లో

మొదటిపేజీ తరువాయి

## రాహుల్ గాంధీకి మరోసారి

దేశంలో అంతర్యుద్ధాన్ని ప్రోత్సహించేలా ఉన్నాయని పిటిషన్‌లో పంకజ్ పాఠక్ పేర్కొన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కులగణన ఎట్టి పరిస్థితుల్లో చేపడుతామని అంటున్నారు రాహుల్‌గాంధీ.. అప్పుడే ఓబీసీలు , దళితులకు న్యాయం జరుగుతుందని అంటున్నారు. అయితే ఎన్నికల ప్రచారంలో ఆయన చేసిన వ్యాఖ్యలపై ఉత్తర ప్రదేశ్ కోర్టు నోటీసులు జారీ చేయడం సంచలనం రేపింది..!

## ఆంధ్రాలో కన్సల్టెన్సీ రాజ్

గరడీతో మభ్య పెట్టడం కొందరు అధికారులకు అలవాటుగా మారిపోయింది. పాలనలో సంస్కరణలు, ప్రజలకు మెరుగైన సేవలు, పారదర్శకత, ప్రజా ప్రయోజనాలు లక్ష్యంగా పనిచేయాల్సిన అధికార యంత్రాంగంలో కొత్త వ్యవస్థలు చొరబడటం, దానినే పాలనా సంస్కరణలుగా భ్రమింప చేయడటం కొన్నేళ్లుగా రివాజుగా మారింది. పార్టీలు ప్రభుత్వాలు మారినపుడల్లా అవే కన్సెల్టెన్సీ సరికొత్త ప్రతిపాదనలు ప్రణాళికలతో రంగురంగుల పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లతో పాలనా యంత్రాంగంలోకి చేరిపోతున్నాయి. ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసి కన్సల్టెన్సీల నియామకంపై ముఖ్యమంత్రి స్థాయిలో అమోదం లభించిన తర్వాత బయటి వ్యక్తులను ప్రభుత్వ వ్యవస్థలోకి కన్సల్టెంట్లుగా తీసుకునేలా జీవో నంబర్ 86ను ఆర్థిక శాఖ జారీ చేసింది. ప్రభుత్వ పాలనా వ్యవస్థలో కీలకమైన శాఖలకు అధిపతులుగా ఆలిండియా సర్వీస్ అధికారులు ఉంటే, వారి కింద వివిధ హోదాల్లో రాష్ట్ర సర్వీస్ అధికారులు పనిచేస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారుల్లో సర్వీస్‌తో పాటు పదోన్నతులతో జాయింట్ డైరెక్టర్లు, అడిషనల్ డైరెక్టర్ స్థాయి వరకు చేరుకుంటారు. సచివాలయాల్లో అయితే వివిధ హోదాల్లో సెక్రటరీలు ఉంటారు. ఈ క్రమంలో కొందరు ఆలిండియా సర్వీస్ అధికారులకు రాష్ట్ర స్థాయి అధికారులపై నమ్మకం లేకపోవడం, స్టేట్ సర్వీస్ అధికారుల్లో చాలామంది రిటైర్మెంట్ వయసుకు దగ్గర్లో ఉండటంతో శాఖాధిపతుల అంచనాలకు అనుగుణంగా నివేదికలు, రిపోర్టులు తయారు చేసే పరిస్థితులు లేవు. కొన్ని శాఖల్లో అధికారులకు పవర్ పాయింట్ తయారు చేయడం, ఎక్సెల్ షీట్లలో డాటాను విశ్లేషించడం వంటి నైపుణ్యాలు కూడా ఉండవు. సరిగ్గా ఈ పరిస్థితుల్ని అనువుగా మార్చుకుని కొన్నేళ్లుగా ప్రభుత్వ శాఖల్లో కన్సల్టెంట్లు చొరబడటం మొదలైంది. ప్రభుత్వ శాఖల్లో విధాన పరమైన నిర్ణయాలను తీసుకోవడం నుంచి వాటి అమలు వరకు క్షేత్ర స్థాయి నుంచి వచ్చే సమాచారాన్ని క్రోడీకరించి నివేదికలు తయారు చేసి, వాటిని అందమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్లుగా మలచి కొత్త పథకాలకు రూపుదిద్దడంలో కన్సల్టెన్సీల పాత్ర మొదలవుతోంది. రాష్ట్ర సర్వీస్ అధికారులతో పనులు చేయించడం కంటే బయటి వారితో పని చేయించడం, తాము కోరుకున్న విధంగా నివేదికలు రూపొందించడం శాఖాధిపతులకు సులువుగా మారింది. కన్సల్టెంట్లు సబ్జెక్ట్ నిపుణుడు అయితే ఫర్లేదు కానీ కొన్నేళ్లుగా కన్సల్టెన్సీల నియామకమే ఫార్సుగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. స్టేట్ సర్వీస్ అధికారులకు క్షేత్ర స్థాయి అవసరాలు, వనరులు, ప్రాక్టికల్‌గా ఉండే ఇబ్బందులపై అవగాహన ఉన్నా వారి సేవల్ని వినియోగించుకోవడం లేదు. స్టేట్ సర్వీస్ అధికారుల నివేదికలను అంగీకరించడానికి ఆలిండియా సర్వీస్ అధికారుల అహం అడ్డుగా మారుతోంది. సరిగ్గా ఇదే బలహీనతను అడ్డం పెట్టుకుని ప్రభుత్వ విభాగాల్లో కన్సల్టెన్సీ చొరబాటు అధికం అయ్యింది. ఇక కన్సల్టెన్సీల నియామకంలో కమిషన్ల పర్వం ఉంటుందనే ఆరోపణలు కూడా లేకపోలేదు. ఈ మొత్తం వ్యవహారంలో సంబంధిత శాఖల మంత్రుల ప్రమేయం కూడా ఉండదు. శాఖాధిపతులు, కమిషనర్ల నిర్ణయం మీదే వీటి నియామకాలు జరిగిపోతాయి. కన్సల్టెంట్లపై పర్యవేక్షణ బాధ్యతలు ఎవరివనే విషయంలో జవాబుదారీతనం తీసుకోడానికి అధికారులు సుముఖంగా ఉండరు. ఆ క్షణానికి ప్రభుత్వ అధినేతను మెప్పించడం, మార్కులు కొట్టేయడంపైనే శాఖాధిపతులైన అధికారుల దృష్టి ఉంటుంది.

## మానవాళికి మరో పెనుముప్పు!

కనిపించకుండా పోయినట్లు వెల్లడించింది. ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (ABC) మీడియా సమావేశంలో ఆరోగ్య మంత్రి టిమ్ నికోల్స్ ఈ విషయాన్ని తెలిపారు. ఇది ఆగస్ట్ 2023లో జరిగిందని చెప్పారు. అయితే వీటిని చోరీ చేశారా? పూర్తిగా నాశనం చేశారా? అన్న దానిపై ల్యాబ్ స్పష్టత ఇవ్వలేదు. ఈ శాంపిల్స్ కనబడకుండా పోయిన ల్యాబ్‌లో వివిధ వ్యాధికారక రోగనిర్ధారణ, పరిశోధన, నిఘాలకు సంబంధించిన వాటిపై రీసెర్చ్ జరుగుతుందని మంత్రి టిమ్ నికోల్స్ పేర్కొన్నారు. ఇక్కడి ల్యాబ్ నుంచి వైరస్ శాంపిల్స్ చోరీకి గురైనప్పటికీ.. వాటివల్ల సమాజానికి ఎటువంటి ముప్పు లేదని చీఫ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జాన్ గెరార్డ్ తెలిపారు. కనబడకుండా పోయిన వైరస్ శాంపిల్స్ మనుగడకు అతితక్కువ ఉష్ణోగ్రతలు అవసరం. అలాంటి వాతావరణం లేకుంటే అవి చాలా వేగంగా క్షీణిస్తాయి. పైగా గత ఐదేళ్లుగా క్వీన్స్‌లాండ్‌లో హెండ్రా, లైసావైరస్ కేసులు ఒక్కటీ నమోదు కాలేదు. ఆస్ట్రేలియా ప్రజలకు హాంటావైరస్ ఇన్‌ఫెక్షన్లు సోకిన దాకలాలు కూడా లేవని డాక్టర్ గెరాడ్ తెలియజేశారు. అయినప్పటికీ మరికొందరు నిపుణులు మాత్రం ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

## టాలీవుడ్ వర్సెస్ స్టేట్ గవర్నమెంట్

కీలక పదవులు నిర్వర్తించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలు కొని ఇప్పటి తెలుగు రాష్ట్రాల వరకూ సినీపరిశ్రమ, రాజకీయ నేతల మధ్య పెద్ద యుద్ధాలే జరిగాయి. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు సూపర్ స్టార్ కృష్ణతో ఆయనకు రాజకీయ విభేదాలు తలెత్తాయి. ఇటీవల పరిస్థితులు చూస్తుంటే సినీ పరిశ్రమ సైతం రాజకీయ పార్టీలకనుగుణంగా మద్దతు పలుకుతున్నాయని తెలుస్తోంది. సినీ పెద్దలు టీడీపీకి మద్దతుగా ఉండేవారు. ఇప్పటికీ కొందరు బహిరంగంగానే తమ మద్దతు తెలుపుతుంటారు. ఎన్టీఆర్ సినీ పరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి ఆరు నెలల్లో సీఎం కావడంతో... ఆయనకు దగ్గరి వారంతా టీడీపీగా మద్దతుగా ఉండేవారు. ఎన్టీఆర్ అనంతరం పార్టీ చంద్రబాబు చేతుల్లోకి వచ్చిన తర్వాత కూడా...సినీ పెద్దల మద్దతు కొనసాగింది. నేటికీ ఆ సంబంధాలను చంద్రబాబు కొనసాగిస్తుంటారు. అయితే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సినీ పరిశ్రమ రాజకీయ పార్టీల వారీగా విడిపోయింది. టీడీపీ, వైసీపీ, జనసేనకు మద్దతుగా విడిపోయారు. ఎక్కువ మంది టీడీపీకి మద్దతుగా ఉన్నా..బయట పడేవారు కాదు. అయితే టీడీపీ ఏపీకి షిఫ్ట్ అవ్వడంతో...తెలంగాణలో ఎవరికి మద్దతుగా ఉండాలనే డైలమా సినీ పెద్దల్లో ఉండేది. రాష్ట్రం విడిపోయిన తర్వాత తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం చేపట్టడంతో తెలంగాణలో బీఆర్ఎస్ మద్దతుగా సినీ పరిశ్రమ ఉండేదని బహిరంగ రహస్యం. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీకి సినీ ప్రముఖుల మద్దతు ఉంటుందనేది వాస్తవం.

## మోహన్ బాబుది కుటుంబ సమస్య

లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళలకు, అసభ్యకరమైన లైంగిక ప్రవర్తనకు లోనైన పిల్లలకు పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులకు దూరంగా సురక్షితమైన వాతావరణంలో చేయూత అందించేందుకే తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కమీషనరేట్ , జిల్లాల్లో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాధితులకు సేవలందించుటలో భరోసా కేంద్రాల ఏర్పాటు మంచి సత్ఫలితాలనిస్తుందన్నారు. లైంగిక వేధింపుల కేసుల్లో శిక్షల శాతం పెరిగిందన్నారు. హైదరాబాద్ లో మొదట ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 27 జిల్లాల్లో భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ భరోసా కేంద్రంలలో బాధిత మహిళలకు మానసిక ప్రోత్సాహంతో పాటు, పోలీస్ సేవలు, అవసరమైన వైద్య సహాయం, న్యాయ సేవ, బాధితులకు సహాయ నిధి మొదలగు ఇతర సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సిటిజెన్ ఫీడ్ బ్యాక్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం వలన ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు వీలుంటుందన్నారు. ముఖ్యంగా మహిళల భద్రతే భరోసా యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. తెలంగాణలో నక్సలిజం లేదని స్పష్టం చేశారు డీజీపీ జితేందర్. ఇక్కడి వాళ్ళే సరిహద్దు ప్రాంతాల్లో పని చేస్తున్నారని తెలిపారు. ఇన్ఫార్మర్ల పేరుతో భౌతిక దాడులకు దిగితే సహించేది లేదన్నారు. అల్లు అర్జున్ విషయంలో చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని డీజీపీ తెలిపారు. మోహన్ బాబుది కుటుంబ సమస్య అని, వాళ్ళు వాళ్లు మాట్లాడుకుంటే పర్వాలేదన్నారు. ఇప్పటికే కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరెబి, అడిషనల్ డీసీపీ లక్ష్మి నారాయణ , ఏసీపీ మాధవి , ఇన్స్పెక్టర్ శ్రీలత , ఎస్బీఐ బ్యాంకు అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు ఎన్ని మారిన వివక్ష ధోరణి మారదా...!?

- పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఒకరు దొర పెత్తనం చూపించారు...
- ఇంకొకరు రెడ్డి సామాజిక వర్గ బహుబలాన్ని ప్రదర్శిస్తున్నారు.!?
- వెరసి తెలంగాణ రాష్ట్రంలో నిరసన తెలిపే స్వేచ్ఛ కూడా లేకుండా పోతుంది.!?
- దివంగత మాల మహానాడు జాతీయ నాయకుడు పివి రావు గారి వర్ధంతి సందర్భంగా నిరసన తెలుపుదామన్న సహకరించని పోలీసులు అలాగే అమిత్ షా వ్యాఖ్యలపై 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుదామంటే పోలీస్ బెటాలియన్ పహార కాయడం, దళిత సమాజపు హక్కులను హరించడమే అన్న విషయంపై జయభేరి సగౌరవంగ అందిస్తున్న కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ రాజకీయ సమగ్ర విశ్లేషణ...



జయభేరి, హైదరాబాద్ :

వాడు పోతే వీడు వీడు పోతే ఇంకొకడు అన్న చందానా తెలంగాణ రాష్ట్రం ఎవరికి నచ్చినట్టుగా పాలకులుగా మారిపోయి ప్రజలను మభ్యపెట్టి అధికారాన్ని చేజిక్కించుకొని పెత్తనాన్ని చెలాయిస్తున్నారు. బానిస సంకెళ్ల కింద అనిగిమనిగి పోరుబాట పట్టిన తెలంగాణ మలిదశ తెలంగాణ ఉద్యమం వెరసి సొంత రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో రెండు దఫాలుగా కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవి అనుభవించి తన పెత్తనాన్ని చూపించుకున్నాడు. వెలమ సామ్రాజ్యం నిర్మించుకున్నాడు.. అనేక సంపదను బాగానే వెనకేసుకొచ్చాడు. ఇక మార్పు కోసం అంటూ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారు. ఎవరు ఊహించని రీతిలో రేవంత్ రెడ్డి సీఎం కూర్చిని దక్కించుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా అసలు ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా దళిత సమాజం అంటే చిన్న చూప!? వారి హక్కులను కాలరాయడం అలవాట!? అన్నట్టుగా మారిపోతుంది. ఒకవైపు రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా మంట కలిసి పోతుంటే ఇంకోవైపు నేతల పొగరుబోతు మాటలపై నిరసన కార్యక్రమం తెలిపే స్వేచ్ఛను కూడా ఈ పోలీసు వ్యవస్థ కల్పించకుంటే మనిషి మనుగడకే ప్రమాదం జరిగే అవకాశం లేదా!?

**ఆర్థిక సామాజిక రాజకీయ ఉపాధి విద్య వైద్యం ఆరోగ్యం కోసం చట్టబద్ధంగా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకుంటే జనాభాలో తక్కువ శాతం ఉన్న వెలమలు సీఎంగా కూర్చిని దక్కించుకుంటారు. రెండవది రెడ్ల సామాజిక వర్గం అధికారాన్ని దక్కించుకుంటుంది. కానీ మాల మాదిగలే ఒకరంటే ఒకరికి పడకుండా విషం చిమ్మే దారుణాలకు పసిగడుతూ దళితులు దళితులనే మోసం చేసుకునే అలవాటు రాష్ట్రంలో మరీ ఎక్కువ అయిపోతుంది. ఇందుకు నిదర్శనంగానే 22న డిసెంబరు రోజున 125 అడుగుల అంబేద్కర్ దగ్గర ఆయన పాదాలకు నమస్కరించి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై నిరసన తెలుపుదామన్న కనీసం పోలీసులు అనుమతిని ఇవ్వకపోవడం అరెస్టు చేయడం ఎక్కడికక్కడ పోలీస్ స్టేషన్లో పెట్టడం దేనికి సంకేతం...!? ఇంకోవైపు ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలకు కచ్చితంగా న్యాయం చేస్తా అని ఒక వర్గం వైపు నిలబడడం దేనికి సంకేతం..!? అంటే మాదిగలు పెట్టుకుంటే సభను ఆమోదించడం మాలులు పెట్టుకుంటే పోలీసులను ఎగదోయడం ఇది రెడ్డి సామాజిక వర్గానికి పరిపాటిగా మారిపోయింది..**

రాష్ట్రం సాధించుకుంది వెలమ కోసమా!? రెడ్డి జాతి కోసమా!? అన్నట్టుగా బీసీ ఉద్యమం కూడా మొదలు కాబోతుంది.! కచ్చితంగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా బీసీ నాయకుడినే ఎన్నుకోవాలంటూ బీసీ సామాజిక వర్గం ఇంకోవైపు ఉద్యమానికి తెరలేపుతుంది.



కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

ఇదిలా ఉంటే అమిత్ షాపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కనీసం అన్న మాటలు వాపస్ తీసుకోకుండా రాజ్యాంగ పదవిలో ఉండి నిండు పార్లమెంటు సభలో అంబేద్కర్ గారిని చులకనగా మాట్లాడడం దేశద్రోహం గా పరిగణించవచ్చు... రాజ్యాంగం అంటే లెక్కలేదు అంబేద్కర్ అంటే విలువలేదు!? ఇలాంటి వ్యక్తులు రాజ్యాంగ పదవిలో ఉండి రాజ్యాంగం పై ప్రమాణం చేసి ఎలా పరిపాలన కొనసాగిస్తారు!? ఇలాంటివారు ప్రజా పాలకులుగా ఉంటే ప్రజలు మతతత్వ వాదులుగా మారిపోయి సాటి మనిషిని ప్రేమించే గుణం ఉంటుందా!? ఇంకవైపు తెలంగాణ రాష్ట్రంలో విచ్చలవిడిగా లిక్కర్ మాఫియా కొనసాగుతుంటే ఇంకోవైపు పోలీసులు కనీసం నిరసన తెలపడానికి కూడా అవకాశం ఇవ్వలేని స్థితిలో మనం ఉన్నామంటే నాటి కెసిఆర్ పాలనే మల్ల యాదికి వస్తుంది అంటూ తెలంగాణ జనం ముక్కున వేలేసుకుంటున్నారు. వాడు పోయి వీడు వీడు పొయ్యి ఇంకొకడు అన్నట్టుగా తెలంగాణ రాష్ట్రంలో కమ్మ కాపు రెడ్డి సామాజిక వర్గమే సీఎం అవుతారా బీసీ నాయకుడు ఎందుకు కాకూడదు అంటూ బీసీ ఉద్యమాన్ని కూడా ముందుకు నడిపించే యువజనలో కార్యక్రమాలు చాపకింద నీరుల సాగుతున్నాయి..

**రాష్ట్రం సాధించుకున్న 10 సంవత్సరాల కాలంలో మాకొద్దీ ప్రభుత్వం మన కేసీఆర్ ను గద్దె దింపిన ప్రజలు పెంకమించి పొయ్యిలో పడ్డట్టుగా పరిపాలన.. రెడ్డి సామాజిక వర్గంలో సాగుతుంది అని ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విముఖత ఏర్పడుతోంది... ఏ శాఖలో చూసిన రెడ్డి సామాజిక వర్గం నాయకులే ఎక్కువగా ఉండడం ఇందుకు ప్రధానంగా ఉదాహరణగా చెప్పకోవచ్చు..**

**125 అడుగుల ఎత్తు విగ్రహం పక్కన అంబేద్కర్ గారిని సందర్శించడం నిరసన కార్యక్రమం తెలపడం, అంత తప్ప అన్నట్టుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తించడం ముమ్మాటికి దుందుడుకు చర్యగా భావించవచ్చు. ఇకనైనా తన ఆలోచనలు మార్చుకొని దళితులను సమానంగా చూడాలని లేని పక్షంలో ఖచ్చితంగా రాబోయే రోజుల్లో భారీ ఎత్తున ఉద్యమం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.... ఇదే గనక జరిగితే సీఎం గా రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలం అయినట్టే....**

ఇప్పటికే కనీసం మంత్రివర్గ విస్తరణ జరగకుండా అనేక సంక్షేమ పథకాలు మ్యానిఫెస్టోలో పెట్టి కేవలం వాటిని కొన్నింటిని అమల్లో పరిచి రాష్ట్రాన్ని మరింత అప్పుల్లోకి నెట్టే ప్రయత్నం సాగుతుందని వామపక్షాలు విపక్షాలు దుమ్మెత్తి పోస్తున్న అవేవీ పట్టించుకోకుండా అప్పు మీద అప్పును తెస్తూ పరిపాలన కొనసాగిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం... ప్రజలు మౌనంగా ఉంటే అది వారి చేతగానితను అనుకోవద్దు.. తిరగబడితే మరో తెలంగాణ ఉద్యమం రాకమానదు... రాష్ట్రంలోని అన్ని కులాలు సమదృష్టితో చూడాలని పలువురు హితో బోధ పలుకుతున్న నేపథ్యంలో సీఎం గా రేవంత్ రెడ్డి ఫిట్ అన్ఫిట్ అనేది రానున్న రోజుల్లో తేలిపోతుందని ఎద్దేవా చేస్తున్నారు..

# భారత్‌తో బలపడుతున్న గల్ఫ్ దేశాల బంధం




భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి. అప్పటి నుంచి భారత్‌తో గల్ఫ్ దేశాల సంబంధాలు మరింత బలపడ్డాయి. ఈ దేశాల నుంచి భారత్‌కు వస్తున్న పెట్టుబడులే ఇందుకు తాజా ఉదాహరణ. వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన డేటా ప్రకారం, గత 10 సంవత్సరాలలో పెట్టుబడి 8 రెట్లు పెరిగింది. గల్ఫ్ సహకార మండలి దేశాల నుండి భారతదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (FDI) సెప్టెంబర్ 2013 నుంచి సెప్టెంబర్ 2024 మధ్య 24.54 బిలియన్ డాటర్లకు పెరిగింది. ఏప్రిల్ 2000 నుంచి సెప్టెంబర్ 2013 మధ్య ఈ దేశాల నుండి 3.046 బిలియన్ డాలర్లతో పోలిస్తే, 8 రెట్లు పెరుగుదల నమోదు చేసుకుంది. గల్ఫ్ కోఆపరేటివ్ కౌన్సిల్ GCC దేశాల నుండి భారతదేశానికి వస్తున్న FDIలో 89 శాతం గత 10 సంవత్సరాలలో వచ్చాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇది భారతదేశం - గల్ఫ్ ప్రాంతం మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాలను ప్రతిబింబిస్తుంది. ప్రస్తుతం కువైట్ గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (GCC)కి అధ్యక్షత వహిస్తోంది. కాబట్టి ప్రధాని నరేంద్ర మోదీ ఎమిరేట్స్ పర్యటన బహ్రెయిన్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యుఎఇ, కువైట్‌లతో భారత్ సత్సంబంధాలు కొనసాగిస్తోంది.

శనివారం(డిసెంబర్ 21) మధ్యాహ్నం కువైట్ చేరుకున్న ప్రధాని మోదీ 43 ఏళ్ల తర్వాత గల్ఫ్‌లో పర్యటించిన తొలి భారత ప్రధానిగా రికార్డు సృష్టించారు. కువైట్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ భారత్‌లో 10 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టిందని, దీంతో ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలపడిందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ చెప్పారు. సావరిన్ వెల్త్ ఫండ్ అయిన కువైట్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ భారతదేశంలో గణనీయమైన పెట్టుబడులు పెట్టిందని, ఇప్పుడు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి పెరుగుతోందని ప్రధాని మోదీ ప్రస్తావించారు. కువైట్ న్యూస్ ఏజెన్సీ (KUNA)కి ఇచ్చిన ఇంటర్వ్యూలో, కువైట్ - భారత్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు వర్తక, వాణిజ్యం ముఖ్యమైన స్తంభాలుగా ఉన్నాయని, రెండు దేశాల మధ్య వాణిజ్యం వృద్ధి చెందుతుందని ప్రధాని మోదీ అన్నారు.

వర్తక, వాణిజ్యం మన ద్వైపాక్షిక సంబంధాలకు ముఖ్యమైన స్తంభాలుగా ఉన్నాయని ప్రధాన మంత్రి CUNA డైరెక్టర్ జనరల్ ఫాత్మా అల్‌సలేమ్‌తో అన్నారు. మన ద్వైపాక్షిక వాణిజ్యం పెరుగుతోంది. భారత్ శక్తి భాగస్వామ్యం ద్వైపాక్షిక వాణిజ్యానికి ప్రత్యేక విలువను ఇస్తున్నట్లు తెలిపారు. కువైట్ భారతదేశానికి ముఖ్యమైన భాగస్వామి, ముడి చమురు సరఫరాలో ఆరవ అతిపెద్ద దేశంగా ఉంది.

భారతదేశ ఇంధన అవసరాలలో 3 శాతం తీరుస్తుంది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2023 24లో 10.47 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. భారతీయ ఎగుమతులు సంవత్సరానికి 34.7 శాతం పెరుగాయి. ఇదిలా ఉండగా, GCC దేశాలతో భారతదేశ వాణిజ్యం 202223లో 184.46 బిలియన్ డాలర్లకు చేరుకుంది. కువైట్‌లో ముఖ్యంగా ఆటోమొబైల్, ఎలక్ట్రికల్, మెకానికల్ మెషినరీ, టెలికమ్యూనికేషన్ రంగాలలో మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులు కొత్త మార్కెట్ క్రియేట్ చేస్తున్నందుకు సంతోషంగా ఉన్నామని ప్రధాని మోదీ KUNA వార్తా సంస్థతో అన్నారు. నేడు భారతదేశం ప్రపంచ స్థాయి ఉత్పత్తులను అతి తక్కువ ధరతో తయారు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడానికి చమురుయేతర వాణిజ్యాన్ని వైవిధ్యపరచడం కీలకమని మోదీ స్పష్టం చేశారు.

# కాలనీల సమస్యలు తప్పక పరిష్కరిస్తా..

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు అన్నారు. ఆదివారం కాప్రా డివిజన్ పరిధిలోని శాలివాహన వెల్ఫేర్ అసోసియేషన్, సాయి రామ్ నగర్ లోని 2BHK నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఉప్పల్ నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, BRS పార్టీ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి గిల్బట్, మచ్చ శ్రీకాంత్ గౌడ్, కాశీ, శాలివాహన కాలనీ ప్రెసిడెంట్ శంకర్, ప్రధాన కార్యదర్శి శ్రీలత, కోశాధికారి వేణుగోపాల్ ప్రధాన కార్యదర్శి వాలీ 2BHK కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాములు నాయక్, ప్రధాన కార్యదర్శి షఫీ, రవీంద్ర, సఫి, సునీత నాయకులు బంక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.






# రియల్ ఎస్టేట్ ను దివాళ పరిచిన ఘనత రేవంత్ రెడ్డిది

మాజీ ఎఫ్డిసి చైర్మన్ ప్రతాప్ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 22 :**

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని ఆర్థికంగా బలహీన పరచడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి సకాలంలో పెట్టుబడి సహాయం అందించపోగా ఒక్కో రైతుకు ఎకరానికి 17,500 బాకీ పడగా ఇప్పటివరకు రైతు భరోసాను రైతుల ఖాతాలో జమ చేయకపోగా రైతుల యొక్క నడ్డిని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కార్ విరుస్తుందన్నారు.అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి రుణమాఫీని అమలు చేయడం చాతకాక పంగనామాలు పెట్టిందన్నారు. ఆదాని లాంటి దేశ అవినీతిపరులకు కొమ్ము కాస్తూ వారికి రెడ్ కార్పొరేట్ పరుస్తూ ఆర్థిక లావాదేవీలను చేసుకుంటూ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ప్రశ్నించే గొంతులను నొక్కుతూ అక్రమంగా కేసులు పెడుతూ తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని గౌరవాన్ని ఢిల్లీ నేతలకు తాకట్టు పెడుతూ ని సిగ్గుగా పరిపాలన సాధ్యం కాక , ప్రణాళికల రూపొందించడంలో విఫలమై, చేతకానితనంతో అసమర్ధతతో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న చర్యల వలన ఇప్పుడు గత కెసిఆర్ ప్రభుత్వం ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని బీద రాష్ట్రంగా మార్చిన ఘనత అసమర్ధ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని వంటేరు ప్రతాపరెడ్డి ఎద్దేవ చేశారు.తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేస్తూ గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా బలోపేతమైన రైతులను అసమర్థ రేవంత్ రెడ్డి విధానాల వలన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆర్థికంగా దిగజారుతున్నారని వంటేరు ప్రతాపరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.అసలు రైతుకే రైతు భరోసా దిక్కు లేదని ఇంకా కౌలు రైతుకు రైతు భరోసా ఎకరానికి 12 వేల రూపాయలు ఎగ్గొట్టారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పత్తి కొనుగోలు కేంద్రాలను తూతూ మంత్రంగా ప్రారంభించి వారం పది రోజులలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఎత్తివేసిన ఘనత రేవంత్ రెడ్డి సర్కారుకు దక్కుతుందన్నారు.రేవంత్ రెడ్డి మూర్ఖత్వపు ఆలోచన వల్ల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ ఢమాల్ అయిందని తెలిపారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 11 సీజన్లలో దాదాపు 73 వేల కోట్ల రూపాయల సొమ్మును నేరుగా రైతుల ఖాతాలో అవినీతి లేకుండా జమ చేసిన ఘనత కేసీఆర్ గారిది అన్నారు.గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుబంధును దేశవ్యాప్తంగా మన్నలను పొందిందని వంటేరు ప్రతాపరెడ్డి తెలిపారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విధానాల వలన రైతు బతుకు భూమికి భరోసా లేకుండా పోయిందని ఎద్దేవ చేశారు.అబద్ధాలు చెప్పడంలో రేవంత్ రెడ్డి దిట్ట అని మూసి కంపు కంటే అధ్వానంగా రేవంత్ రెడ్డి నోరు తయారైందని అబద్ధాలు అసత్యాలు ప్రచారం చేయడంలో రేవంత్ రెడ్డికి అసత్య అవార్డు ఇవ్వాలని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గుడుస్తున్న ఒక్క హామీనీ కూడా అమలు చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి ఏరులై పారుతుందని, అక్రమాలు అడుగడుగున జరుగుతున్నాయని, కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ నాయకులు సెటిల్మెంట్లు చేస్తూ కంపెనీ యాజమాన్యాలను మరియు కాంట్రాక్టర్లను బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ అంటేనే స్కీములు స్కాంలు అవినీతి అక్రమాలు అని తెలిపారు.ఇప్పటికైనా కాంగ్రెస్ రేవంత్ రెడ్డి అసమర్ధ సర్కార్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 420 హామీలను 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా పూటకో మాట మాట్లాడకుండా డైవర్షన్ రాజకీయాలు చేయకుండ ప్రజల సమయం వృధా చేయకుండా గాడిదప్పిన పాలనను చేతకాకపోతే ప్రతిపక్ష పార్టీల సలహాలు సూచనలు తీసుకుని ప్రజలకు పాలన అందించాలని వంటేరు ప్రతాప్ రెడ్డి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వానికి చురకలంటించారు.

## భూ కబ్జాలకు పాల్పడుతున్న వారిపై
# కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదు

నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్

కబ్జాలపై మేడిపల్లి తహసిల్దార్, బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్, మేయర్ కు ఫిర్యాదు చేసిన దేవేందర్ నగర్ కాలనీ కమిటీ

**జయభేరి, మేడిపల్లి, డిసెంబర్ 20 :**



ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ హెచ్చరించారు.ఈ సందర్భంగా మేడిపల్లి తహసిల్దార్ హసీనా, బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ రామలింగం, నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ను దేవేందర్ నగర్ కాలనీ కమిటీ సభ్యులు కలిసి ప్రభుత్వ భూముల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలో రోజురోజుకు అక్రమ కట్టడాలు మితిమీరిపోతున్నాయన్నారు.సర్వేనెంబర్ 63/1 ప్రభుత్వ భూమిని కొంతమంది స్వార్థపరుల కారణంగా రోజురోజుకు కుంచించుకు పోతుందని ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో బోడుప్పల్ కార్పొరేషన్ ప్రజావసరాలకు కోసం బస్తి దావకాన, కమిటి హాల్, పిల్లల ఆట స్థలంకు భూమి లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అప్పనంగా దోచుకొని అమాయక ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకున్న నాయకులు, ప్రభుత్వం మారడంతో వారు చేసిన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు కబ్జాలు కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో లాగే ఇప్పుడు కూడా ఉన్న ప్రభుత్వ భూమిని స్వాహా చేస్తుండడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనే ఉద్దేశ్యంతో మేయర్ ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తుండగా అధికారులు దానిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు.నిరుపేదలు ఎవ్వరూ కూడా దళారుల మాటలు నమ్మి ప్రభుత్వ భూమిలో ఏలాంటి కొనుగోళ్ళు చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దానగళ్ళ యాదగిరి, దేవేందర్ నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి మరాటి మల్లేష్, ఉపాధ్యక్షుడు బోడగళ్ళ సదానంద్, జెన్నె రాజు, బెల్లపురి మధు, మరాటి మత్స్యగిరి, వాసురి యాదగిరి, కట్టం స్వామి తదితరులు పాల్గొన్నారు.

# గుండ్లపోచంపల్లి మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కుంద భానుచందర్

**జయభేరి, మేడ్చల్ :**



గుండ్ల పోచంపల్లి మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా కుండ భానుచందర్ ను నియమిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పత్తి కుమార్, మేడ్చల్ మున్సిపల్ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పానుగంటి మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కుండ భానుచందర్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పత్తి కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కమిటీ ఎప్పుడు కష్టపడే వారిని గుర్తించి, అలాగే గతంలో చేసిన పనులను పరిశీలిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరికి అవకాశం కల్పిస్తుందని ఆయన అన్నారు.

నూతనంగా నియమితులైన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గుండ్లపోచంపల్లి మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్ మాట్లాడుతూ నా పైన ఉన్న నమ్మకంతో నాకు గుండ్లపోచంపల్లి మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్ష పదవి అప్పగించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రియతమ్, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని కుండ భానుచందర్ తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ లోని 9 గ్రామాల ప్రజలందరినీ కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కుండ భానుచందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలలోకి తీసుకెళ్తూ ప్రజలకు సేవ చేస్తానని అన్నారు. గతంలో గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసిన అనుభవం ఉందని ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని కూడా కుండ భానుచందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పానుగంటి మహేష్, కుండ ప్రవీణ్ కుమార్, కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు షోలాపూర్ చేదార్ల పంపిణి

తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 100 మంది పేదలకు పంపిణి.

**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 22 :**



తలకోక్కుల చంద్రకళ 9 వ వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ భవన్ లో 100 మంది పేదలకు తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్టు భవన్ లో సోలాపూర్ చెద్దర్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ గత 9 సంవత్సరాల కాలంగా ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని రాబోయే రోజులలో ట్రస్టు ద్వారా విస్తృత సేవ కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్,దేవులపల్లి రాజారామ్ ఇప్ప ప్రభాకర్,ఆడెపు బాలచంద్రం, కృష్ణమూర్తి, తుమ్మ నర్సింలు, శ్రీనివాస్, దూడం శ్రీరాములు, శివ కుమార్, మాదాసు జగదీశ్వర్, చెప్యాల మల్లేశం, కోశాధికారి టీ.దుర్గా ప్రసాద్,కార్యదర్శి టీ.మధుసూదన్ సభ్యులు ఆడెపు వెంకటలక్ష్మి భాగ్యలక్ష్మి స్వరూప సరోజినీ దేవి శోభారాణి మణికాంత్ కృష్ణకాంత్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## విహారిక కాలనీ సర్వసభ్య సమావేశం

ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి

కాలనీలో సొంత నిధులతో సి సి కెమెరా లు, సైన్ బోర్డులు ఏర్పాటు

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్లోని విహారిక కాలనీ సి సెక్టార్ కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పాల్గొని కాలనీలో జరిగిన అభివృద్ధి పనులగూర్చి చర్చించారు. అందులో భాగంగా మిగిలిన రోడ్ పనులను త్వరలో పూర్తి చేపిస్తామని హామీ ఇచ్చారు, అనంతరం కాలనీలో సి సి కెమెరాలు, సైన్ బోర్డ్స్ ను ఏర్పాటు చేపిస్తానాని కాలనీ అసోసియేషన్ కు హామీ ఇవ్వడం జరిగింది. కాలనీ అభివృద్ధి సహకరించిన కార్పొరేటర్ హరిశంకర్రెడ్డికి కాలనీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కార్యదర్శి విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు, అడ్వైజర్లు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

## హోటల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే చామకూర



**జయభేరి, ఘట్కేసర్ :**

పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లీ లో ఓరుగల్లు స్పైసస్ హోటల్ ను ప్రారంభించిన మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి. ఆదివారం పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లీ లో ఓరుగల్లు స్పైసస్ హోటల్ ను ప్రారంభించి రాఘవేందర్ రెడ్డి, వివేక్ లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్డియా నాయక్, కౌన్సిలర్ సుర్వి రవీందర్ గౌడ్, సింగిరెడ్డి సాయిరెడ్డి, నాయకులు బండారి శ్రీనివాస్, గౌడ్, పాలుగుల మాధవ రెడ్డి, బొక్కా ప్రభాకర్ రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, ఆకిటి బల్ రెడ్డి, అబ్బా వతి నర్సింహా, సుర్వి శ్రీనివాస్ గౌడ్, మోటు పల్లి శ్రీనివాస్, బండారి ఆంజనేయులు, వివిధ పార్టీల నాయకులు యాజమాన్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాలభైరవ ఆలయంలో ప్రత్యేక పూజలు



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లే అవుట్ లోని శ్రీ కాలభైరవ ఆలయంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పూజలు చేశారు. కాల భైరవ ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈగ సంతోష్, తెల్కల మోహన్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, పూజల లక్ష్మణ్, శామీర్పేట్ రాకేష్ రెడ్డి, శామీర్పేట్ వినోద్ రెడ్డి, ఆకారపు అరుణ్, అన్వర్, కంచెమీద శివయ్య, పూజల ప్రభాకర్, సల్ల ప్రభాకర్ రెడ్డి, ఉపేందర్, మంద మురళీకృష్ణ రెడ్డి, బూత్కూరి రాజు, గౌరిగ నగేష్, భాస్కర్ రెడ్డి, అలుగుల అనిల్ కుమార్, మంద సుమన్ రెడ్డి, నర్సింహా రెడ్డి, సత్యం, అమర్, రాజేందర్ రెడ్డి, రాఘవేందర్ గుప్తా, నవీన్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి, బీడిగా మల్లేష్ గౌడ్, వెంకటేష్ గుప్తా, జీవన్, ప్రేమ్, పాలడుగు సంపత్, ఈగ బాబు, తూర్పాటి జంగయ్య, గౌరిగ శివాజీ పాల్గొన్నారు.

## నిరుపేదలకు బాసటగా నిలిచిన సీఎం సహాయ నిధి

చెక్కులు పంపిణీ చేస్తున్న ఉమ్మడి మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 22 :**

గజ్వేల్ పట్టణంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు ఖర్చుతో కూడుకున్న వైద్యంకి ఆర్థిక సహాయం అందించి బాసటగా నిలిచే గొప్ప కార్యక్రమం ఈ ముఖ్యమంత్రి సహాయనిధి అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఆర్థికంగా ఆదుకున్న ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారిదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ములుగు మండల సింగన్నగూడ గ్రామం మాజీ తాజా సర్పంచ్ బాలకృష్ణ, దౌల్తాబాద్ మండల ఇందుప్రియలు మాజీ తాజా ఎంపీటీసీ మల్లేశం, విలేజ్ ప్రెసిడెంట్ వేంపల్లి శ్రీనివాస్ ఉన్నారు.బుర్ర నాగమణి కి రూ 64,000, చీరల సంధ్య రూ 55,000, మామిడి రాములు రూ 7500 చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిన్న కృష్ణ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## మహిళకు అండగా మనం ఫౌండేషన్

**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 22 :**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితం అయిన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం దిలాల్ పూర్ గ్రామానికి చెందిన సూర్య కళ అనే వివాహితకు గజ్వేల్ కు చెందిన మనం ఫౌండేషన్ అండగా నిలిచింది.ఆదివారం మనం ఫౌండేషన్ అధ్యక్షులు గౌడుగు స్వామి ఆధ్వర్యంలో 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. అలాగే సూర్యకళ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మనం ఫౌండేషన్ కోశాధికారి ఆంజనేయులు,సభ్యులు మల్లికార్జున్, సత్యనారాయణ చారి,రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న నిందితులు అరెస్ట్

నిందితుల నుండి 76 గ్రాముల గంజాయి స్వాధీనం



**జయభేరి, మర్కుక్, డిసెంబర్ 22 :**

సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు సిబ్బంది మర్కుక్ ఎస్ఐ దామోదర్ సిబ్బంది కలసి కర్కపట్ల గ్రామ శివారులో ఇద్దరు నిందితులు కలసి గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారంపై శనివారం సాయంత్రం వెళ్లి రైడ్ చేయగా కర్కపట్ల గ్రామానికి చెందిన ఇద్దరి నిందితులను గిర్మిళ్ళ సాయిమధు(19), సారా మహేశ్ లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 76 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించడం జరిగింది.పై ఇద్దరు నిందితులను మర్కుక్ ఎస్ఐ దామోదర్ ఆదివారం అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు పంపించారు.గ్రామాలలో ఇతర ప్రదేశాలలో ఎవరైనా అక్రమంగా గంజాయి కలిగి ఉన్న విక్రయించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## మంత్రి సీతక్కను కలిసిన మాజి సర్పంచులు



**జయభేరి, ములుగు, డిసెంబర్ 22 :**

గ్రామ పంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను ములుగు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో కలిసి మాజి సర్పంచులు వారిని కోరారు. ఈ మేరకు తెలంగాణ ఆదివారం వారిని కలిసి వినతిపత్రం అందజేశారు.సర్పంచ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ లు గవర్నర్ ను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఆదర్శవంతమైన గ్రామ పంచాయతీలుగా గ్రామాలను తీర్చిదిద్దడంలో తమ వంతు కృషి చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ పంచాయతీలలో ప్రజల సౌకర్యార్థం వీధిలైట్ల నిర్వహణ, అంతర్గత మురుగు కాల్వల ఏర్పాటు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, పల్లె ప్రగతి, తాగునీటి పథకాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పనులకు సంబంధించి మాజీ సర్పంచ్ లు లక్షల రూపాయాలు రావాల్సి ఉందని మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా తో కలిసి మంత్రి సీతక్కకు సర్పంచులు విన్నవించారు.

## బస్సు కింద పడి మహిళా మృతి

**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 22 :**

ఆర్టీసీ బస్సు కింద పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన బుచ్చవ్వ (70) అనే వృద్ధురాలు తన ఇంటి అవసరాల నిమిత్తం గజ్వేల్ పట్టణానికి వచ్చింది. ఈ తరుణంలో పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు దుబ్బాక డిపోకు చెందిన AP29 Z 3332 నెంబర్ గల బస్సు కింద పడటంతో కాళ్ళు, చేతులు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది బాధితురాలిని హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఆర్వీఎం ఆసుపత్రికి అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా బుచ్చవ్వ మార్గమధ్యలో మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన గజ్వేల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ



**జయభేరి, హన్మకొండ, డిసెంబర్ 22:**

హన్మకొండ భవాని నగర్ లోని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి నివాసంలో ఆదివారం మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. ఉదయం 10గంటలకు బ్రహ్మశ్రీ చంద్రమౌళి వెంకటేష్ శర్మ గురుస్వామిచే ఇమ్మడి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అయ్యప్ప స్వామి మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో జరిపారు. స్వామియే శరణమయ్యప్ప అంటూ భక్తుల శరణు ఘోషతో ఆ ప్రాంతం మారుమోగింది. ఇనుగుర్తి మధు అయ్యప్ప కళాబృందం అయ్యప్పమాలధారులు ఆలపించిన అయ్యప్ప పాటలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. అయ్యప్ప పడిపూజ ముగిసిన వెంటనే పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నదానం చేసారు. అనంతరం అయ్యప్ప స్వాములకు వారి కుటుంబ సభ్యులు పాదాభివందనాలు చేసారు.

# శ్రీ విష్ణు శివాలయ అభివృద్ధికి నిధులు మంజూరు

నిధులు మంజూరు చేసిన మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్

**జయభేరి, డిసెంబర్ 22:**



మూడుచింతల పల్లి మండలం ఉద్దెమర్రిలోని శ్రీ విష్ణు శివాలయం అభివృద్ధికి దేవాదాయ ధర్మదాయ శాఖ తరపున రూ.50 లక్షలు మంజూరు అయ్యాయి. కాగా దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన మంత్రి కొండా సురేఖకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలవల్లి నర్సింలు యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని శ్రీవిష్ణు శివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలయ కమిటీ పాలక వర్గం ప్రమాణస్వీకారోత్సవానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరు కాగా, అలయ కమిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అతనికి వినతిపత్రం అందించామని, దీనిపై అతను స్పందించి సత్వరమే ఈ ఆలయానికి రూ.50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ లకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. అనంతరం దేవస్థాన కమిటీ చైర్మన్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఆలయానికి పెద్ద ఎత్తున నిధులు మంజురుకు కృషి చేసిన తోటకూర వజ్రెష్ యాదవ్ కు రుణపడి ఉంటామన్నారు.

ఈ నిధులతో ఆలయ రాజగోపురం,నీరాలి మండపం, స్వామి వారి పుష్కరిని, పుష్కర ఘాట్ నిర్మాణం చేపడుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ లు దోసకాయల వెంకటేష్, పట్టాబాల్ నర్సింహా, ఆలయ కమిటీ సభ్యులు బూడిద రవీందర్ గౌడ్,సామల రాజి రెడ్డి, బురిగళ్ళ రమేష్, పార్టీ నాయకులు విష్ణుగౌడ్, వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకటగిరిప్రసాద్, తునికి వెంకటేష్, గోపిరెడ్డి,శ్రీధర్ చారి,సత్యనారాయణ, శేఖర్, సుధాకర్, ఆలయ పూజారీ త్రిగుళ్ల వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు అడ్డుపడ్డారు.. క్షౌరశాలలు బందు పెట్టాం

న్యాయం జరిగే వరకు శుభ, అశుభ కార్యాలకు దూరంగా ఉంటాం

**జయభేరి, మార్కుక్, డిసెంబర్ 22 :**



గ్రామంలో నివాసముంటున్న మాకు సమాన హక్కులేదన్నట్లుగా మా వర్గానికి చెందిన మహిళ మృతదేహాన్ని స్మశాన వాటికలోనికి రానివ్వకపోవడం బాధాకరమని మర్కుక్ నాయి బ్రాహ్మణులు ఆవేదన వ్యక్తం చేశారు. మా కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు సవరాలు,శుభ,అశుభ కార్యక్రమాల్లో మా కుల వృత్తులను నిర్వహించబోమని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన మర్కుక్ లోని నాయి బ్రాహ్మణుల వర్గానికి చెందిన లింగంపల్లి ఎల్లమ్మ శుక్రవారం మృతి చెందిగా దహన సంస్కారాలు కోసం గ్రామంలో రెండు స్మశాన వాటికల్లోని ఆయా వర్గాలకు చెందిన వారు అనుమతించలేదు. చివరగా ఊరు శివారులో ఉన్న చెరువులో ఎల్లమ్మ మృత దేహాన్ని దహనం చేశారు. అయితే గ్రామంలోనే నివాసముంటున్న మాకు, సమాన హక్కుగా స్మశాన వాటికల్లోని ఎందుకు అనుమతించరంటూ నాయి బ్రాహ్మణులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణులు మాట్లాడుతూ హైదారాబాద్ వంటి పెద్ద పెద్ద నగరాల్లో సైతం చనిపోయిన వారందరికీ ఎలాంటి తారతమ్యాలు లేకుండా స్మశాన వాటికల్లో చివరి మజిలీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అలాంటిది మండల కేంద్రమైన మర్కుక్ లో ఇలా కులాల పేరిట దహన సంస్కారాలకు అనుమతించకుండా చనిపోయిన వారి కుటుంబాలకు ఇబ్బందులకు గురి చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని కులాలతో సమానంగా మా నాయి బ్రాహ్మణులకు సైతం దహన సంస్కరాలకు అడ్డుపడవద్దని వారన్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని వారు కోరారు. ఇకనైనా ఇలాంటి కులవివక్షను వీడి అగ్రవర్ణలకు చెందిన వారు అన్ని కులాల వారితో సోదర భావంతో మేధిలితే బాగుంటుందని పేర్కొన్నారు.

## యేదేచ్ఛగా బాంబుల మూత ప్రాణం పోతే బాధ్యులెవరు

**జయభేరి, డిసెంబర్ 22:**



పదేపదే తెలంగాణ సర్కార్ ప్రజలకు ఏదైనా నష్టం జరిగితే సహించేదే లేదంటూ నాడు అసెంబ్లీ సమావేశాలలో ప్రసవించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అయినా కూడా కొంతమంది రియల్ ఎస్టేట్ మాఫియా అక్రమాలకు ప్రజల ప్రాణాలతో లెక్క లేదంటు చెలగాటమాడుతున్నారు. శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓపెన్ బ్లాస్టింగ్ చేస్తూ ప్రజల ప్రాణాలకు హాని కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారు. ఇదే విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలు ఎస్ఓటి పోలీస్ లకు నిర్వహకులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఓటి అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి ఫోటోలు వీడియోలు తీసుకొని ఇలాంటి కేసు నమోదు చేయకుండా వెళ్లిపోవడంపై ప్రజలు ఆందోళన గురవుతున్నారు. ఓవైపు పోలీసులకు మరోవైపు ఎస్ఓటి అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా ఏమాత్రం లెక్క చేయకుండా అక్రమదారుడుకి అండగా నిలిచి రియల్ ఎస్టేట్ మాఫీయా ఇచ్చే కాసులకు కకృతి పడుతూ ప్రజల జీవితాలతో చెలగటం ఆడుతున్నారు. పోలీసుల కనుసందాల్లోనే అక్రమ బ్లాస్టింగ్లు అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మారుతున్న నిర్వాహకుడి మాటలు ఇలా మేము పోలీసులను కలిశాము మాకు అనుమతులు అవసరం లేదు మీరు ఏదైనా చేసి ఉంటే చేసుకోండి ఇది గజ్వేల్ ప్రాంతానికి చెందిన వంట్టేరు ప్రతాపరెడ్డి సైట్ ఎవరు ఏమి చేయలేరు అంటూ బెదిరింపులు దీనికి స్థానిక పలువురు వత్తాసు పలకడం పై విమర్శలకు దారితీస్తుంది.



## ప్రైమ్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా మ్యాథమెటిక్స్ డే



విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ ను ఆదర్శంగా తీసుకోవాలి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏరుకొండ రాము

మారుమూల ప్రాంత విద్యార్థుల ఉన్నతికి కృషి ప్రైమ్ అకాడమీ నిర్వాహకులు శ్రీనివాస్

**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి పట్టణంలో దేవరకొండ రోడ్డులో గల మటీల్డా ఇంగ్లీష్ మాధ్యమ పాఠశాలలో ప్రైమ్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీనివాస అమానుజన్ జయంతి మ్యాత్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొండమల్లేపల్లి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏరుకొండ రాము మాట్లాడుతూ విద్యార్థులు మ్యాథ్స్ లో పట్టును సాధించి శ్రీనివాస రామానుజన్ గారిని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. శ్రీనివాస రామానుజన్ తమిళనాడులోని ఈరోడు గ్రామంలో 1887 డిసెంబర్ 22న జన్మించాడని అన్నారు. సంఖ్యల విశ్లేషణాత్మక సిద్ధాంతానికి గణనీయమైన కృషి చేశాడని అన్నారు. ఇక పరిష్కారం కావు అన్న గణితాంలోని కొన్ని అంశాలను కూడా పరిష్కారం చూపిన ఘనత ఆయనకే చెందుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గణిత మేధావులలో శ్రీనివాస రామానుజన్ ఒకరిగా గుర్తింపు పొందారు అని అన్నారు . 1918 ఫిబ్రవరి 18న శ్రీనివాస రామానుజన్ లండన్ రాయల్ సొసైటీ ఫెలో గా ఎన్నికయ్యారని అన్నారు. విద్యార్థులు అబ్దుల్ కలాం, అంబేద్కర్ వంటి ఆదర్శప్రాయలను ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. మ్యాథ్స్ డే సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. తల్లిదండ్రులను గురువులను గౌరవించి సన్మార్గంలో నడిచి ఉన్నతంగా ఎదగాలని సూచించారు .విద్యార్థి దశలో సాత్విక ,పౌష్టిక ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. మారుమూల ప్రాంతమైన కొండమల్లేపల్లి పట్టణంలో విద్యార్థులకు ఐఐటి, నవోదయ, సైనిక్ స్కూల్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు .గతంలో పోటీ పరీక్షలకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు హైదరాబాదు వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు అని, ప్రస్తుతం ఇక్కడే కోచింగ్ ఇస్తుండడంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ తో పాటు పలు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ విద్యార్థులకు పోటీ పరీక్షలలో శిక్షణ ఇవ్వడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమ్ అకాడమీ నిర్వాహకులు కల్మూరి శ్రీనివాస్, సత్యనారాయణ, అనంతలక్ష్మి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ అయ్యప్ప స్వామి అనుగ్రహం పొందాలి


దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది

ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

**జయభేరి, దేవరకొండ :**




ప్రతి ఒక్కరూ అయ్యప్ప స్వామి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణములో అయ్యప్ప దేవాలయంలో పడి పూజ సందర్భంగా మాజీ శాసన సభ్యులు రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని అయన తెలిపారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నీల రవికుమార్,చంద్రమౌళి గురుస్వామి, రమావత్ మోహన్ కృష్ణ, రమావత్ తులిసిరం నాయక్, వద్ధ్యా బాలు నాయక్, పగిడిమర్రి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 25, 26వ తేదీలలో ఉపరాష్ట్రపతి జగదీప్ థన్కర్ రాష్ట్ర పర్యటన

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 22:**

ఈ నెల 25, 26వ తేదీలలో రెండు రోజుల పాటు భారత ఉపరాష్ట్రపతి జగదీప్ థన్కర్ రాష్ట్ర పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్ల పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం తెలంగాణ సచివాలయంలో ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి 25వ తేదీన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి ICAR కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శిస్తారని, అక్కడే సేంద్రీయ విధానంలో సాగు చేస్తున్న 500 మంది రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారని సీఎస్ తెలిపారు. 25వ తేది రాత్రి కన్హా శాంతివనంలో బస చేస్తారని తెలిపారు. రాష్ట్రపతి పర్యటన జరిగే రెండు రోజుల పాటు బ్లూ బుక్ ప్రకారం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రంగా రెడ్డి, మెదక్ జిల్లా కలెక్టర్లు, ఉప రాష్ట్రపతి కార్యాలయంతో, రాష్ట్రంలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సి.ఎస్ ఆదేశించారు.పోలీసు శాఖ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్, బందోబస్త్ చేయాలని డిజిపిని ఆదేశించారు. ఈ పర్యటనలో సరిపడా వైద్య సిబ్బందితో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. భారత ఉపరాష్ట్రపతి ప్రయాణించే దారిలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని R&B శాఖకు సూచించారు. అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని టీఎస్ఎస్పీడీసీఎల్ యం.డిని ఆదేశించారు. అదే విధంగా అగ్నిమాపక శాఖ విభాగం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. 26వ తేదీ ఉదయం ఢిల్లీకి తిరుగు ప్రయాణం వరకు సంబంధిత విభాగాల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సి.ఎస్ ఆదేశించారు.




# 100 కోట్లు ఇచ్చినా చేయను

ఒకప్పటి అందాలతార అమీషా పటేల్‌కి కోపం వచ్చింది. 'గదర్ 2' దర్శకుడు అనిల్‌శర్మపై అంతెత్తు లేచింది. వివరాల్లోకెళ్తే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అనిల్‌శర్మ మాట్లాడుతూ 'గదర్ 2'లో అత్తగా నటించేందుకు అమీషా అంగీకరించలేదని, నర్గీస్ దత్ లాంటి మహానటీమణులు చిన్న వయసులోనే వృద్ధ పాత్రలు పోషించారని ఎంత నచ్చజెప్పినా.. ఆమె మాత్రం చేయను గాక చేయనన్నదని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై అమీషా వివరణ ఇస్తూ.. 'డియర్ అనిల్.. అది జీవితం కాదు. కేవలం సినిమా. కాబట్టి తెరపై నేను ఏం చేయాలి? ఏం చేయకూడదు అనేది పూర్తిగా నా వ్యక్తిగతం. 'గదర్' కోసమే కాదు, ఏ సినిమా కోసమైనా సరే.. అత్తయ్య పాత్రలు నేను చేయను. వందకోట్లు ఇచ్చినా అలాంటి పాత్రలకు అంగీకరించను. మీరంటే నాకెంతో గౌరవం. దాన్ని తగ్గించుకోవద్దు.' అంటూ ఘాటుగా స్పందించింది అమీషా.



# అయిష్టంగానే.. అబ్బాయిగా!

ఎంతోమంది ఆర్టిస్టులు బాలనటులుగా బాలీవుడ్‌లో అడుగు పెట్టారు. సహజమైన నటనతో మెప్పించి.. సక్సెస్ కొట్టారు. అలా.. బాలనటుడిగా ఒక తరానికి గుర్తుండిపోయిన నటి.. అహ్సాస్ చన్నా! పరిశ్రమలోకి అబ్బాయిగా అడుగు పెట్టి.. ఇప్పుడు హీరోయిన్‌గా రాణిస్తున్నది. అయితే, బాల్యంలో తాను బలవంతంగానే బాలుడి పాత్రలు వేసినట్లు తాజాగా చెప్పుకొచ్చింది. ముంబయిలోని పంజాబీ సిక్కు కుటుంబంలో జన్మించిన అహ్సాస్ చన్నా.. ఐదేళ్ల వయసులోనే బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. 'వాస్తు శాస్త్రం' చిత్రంలో సుస్మితాసేన్ కొడుకు 'రోహన్'గా వెండితెరకు పరిచయమైంది. 2004లో విడుదలైన ఈ చిత్రానికి సెన్సేషనల్ డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వం వహించారు. 2006లో కరణ్ జోహార్ దర్శకత్వం వహించిన హిట్ చిత్రం.. 'కభీ అల్విదా నా కెహనా'లోనూ షారుఖ్ ఖాన్ – ప్రీతి జింటా కొడుకు 'అర్జున్' పాత్రలో ఒదిగిపోయింది.




## పుష్ప 2 సినిమాను ఎంజాయ్ చేస్తున్న స్మగ్లర్..

# పోలీసులు ఏం చేశారంటే?

ముంబై: డ్రగ్స్ స్మగ్లింగ్‌తోపాటు రెండు హత్యా కేసుల్లో నిందితుడైన వ్యక్తి పుష్ప 2 సినిమా చూస్తూ ఆనందంలో మునిగిపోయాడు. అయితే థియేటర్‌లోకి ప్రవేశించిన పోలీసులు అతడికి షాక్ ఇచ్చారు. వారి కళ్లగప్పి తప్పించుకుని తిరుగుతున్న ఆ నిందితుడ్ని అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. గ్యాంగ్‌స్టర్ విశాల్ మేష్రామ్‌పై 27 కేసులున్నాయి. ఇద్దర్ని హత్య చేయడంతోపాటు డ్రగ్స్ స్మగ్లింగ్‌కు పాల్పడిన అతడ్ని అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయితే గత పది నెలలుగా వారి కళ్లగప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు. కాగా, విశాల్ ఇటీవల కొత్త కారు కొన్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. అతడి కదలికలపై నిఘా పెట్టారు. హీరో అల్లు అర్జున్ తాజా మూవీ 'పుష్ప 2: ది రూల్' సినిమా చూడటం పట్ల అతడు ఆసక్తి చూపుతున్నట్లు పసిగట్టారు.

గురువారం అర్ధరాత్రి వేళ మల్టీప్లెక్స్‌లో ఆ సినిమా చూడటంలో నిమగ్నమైన విశాల్‌కు షాక్ ఇచ్చారు. మరోవైపు థియేటర్‌కు చేరుకున్న పోలీసులు ముందు జాగ్రత్తగా కారు టైర్లలో గాలి తీసేశారు. ఆ తర్వాత సినిమా హాల్‌లోకి ప్రవేశించారు. పుష్ప సినిమా చూడటంలో బిజీగా ఉన్న విశాల్‌ను చుట్టుముట్టి అతడ్ని అరెస్ట్ చేశారు. మిగతా ప్రేక్షకులకు ఇబ్బంది కలుగకుండా వెంటనే అతడ్ని అక్కడి నుంచి తీసుకెళ్లారు. సినిమా సన్నివేశాన్ని తలపించేలా ఉన్న ఇది చూసి ప్రేక్షకులు షాక్ అయ్యారు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com